


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com

ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 603 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 04 గురువారం డిసెంబర్2025 పేజీలు : 4 వెల : అమూల్యం

## స్క్రబ్ టైఫస్ కేసుల నమోదుపై

# సీఎం చంద్రబాబు సమీక్ష

**- వ్యాధిపై అవగాహన కల్పించాలన్న సీఎం చంద్రబాబు - వ్యాధి తీవ్రత పెరగక ముందే చికిత్స అందించాలని సూచన**

**- స్క్రబ్ టైఫస్ అంటువ్యాధి కాదన్న అధికారులు**

అమరావతి, సింహగర్జన సంపాదకుడు, డా సునీల్ కుమార్ యాండ్ర, డిసెంబర్ 03 : స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ వ్యాధికి సంబంధించిన కేసుల నమోదుపై వైద్యారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి సౌరభ్ గౌర్‌తో రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న సమీక్షించారు. ఇటీవల విజయనగరం జిల్లాలో స్క్రబ్ టైఫస్ బారిన పడి చందక రాజేశ్వరి అనే మహిళ మృతి చెందిన తరహా ఘటనలు మరెక్కడా జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. చిగ్గర మైట్ తరహా కీటకాలు కుట్టడం వల్ల వచ్చే వ్యాధితో పాటు, ప్రమాదాన్ని ఏ విధంగా కట్టడి చేయాలనే దానిపై ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ క్రమంలో చందక రాజేశ్వరి మృతికి సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రికి సౌరభ్ గౌర్ వివరించారు. విజయనగరానికి చెందిన రాజేశ్వరికి చిగ్గర్ మైట్ అనే కీటకం కుట్టిందని, దీంతో ముందుగా టైఫాయిడ్ చికిత్స అందించారని... ఆ తర్వాత రాపిడ్ టెస్ట్ ద్వారా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ అని తేల్చారని సౌరభ్ గౌర్ సీఎంకు వివరించారు. విజయనగరం క్వాసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె చనిపోయారని అధికారులు చెప్పారు. స్క్రబ్ టైఫస్ కేసులు, ఆ వ్యాధి లక్షణాలు, అలాగే వాటి వల్ల



ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందనే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సీఎం సూచించారు.

## పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకూ

## అభివృద్ధిలో భాగమయ్యేలా


# జనసేన కమిటీలు

**-ప్రతి గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో అయిదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు**

**-కేంద్ర కార్యాలయం పర్యవేక్షణలో కాన్ ఫ్లిక్ట్ మేనేజ్మెంట్ కమిటీ నియామకం**

**-ప్రతి కమిటీలో మహిళలకు స్థానం -జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం**

మంగళగిరి, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, డిసెంబర్ 03 : జనసేన పార్టీ నాయకులు, శ్రేణులు తమ పంచాయతీల నుంచి పార్లమెంట్ నియోజకవర్గం వరకూ అభివృద్ధిలో భాగం కావాలి. తమ ప్రాంత అభివృద్ధిలో, అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో క్రియాశీలకంగా వ్యవహరించేలా పార్టీ శ్రేణులను ముందుకు తీసుకువెళ్దామని జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ కమిటీల నిర్మాణంలో భాగంగా గ్రామ స్థాయిలో అయిదుగురు సభ్యులతో కమిటీని నియమించాలని, వారు గ్రామాభివృద్ధిలో భాగమయ్యేలా చేద్దామన్నారు.



అదే విధంగా మండల, అసెంబ్లీ, లోక్ సభ నియోజకవర్గాల అభివృద్ధిపై ఆయా కమిటీలు దృష్టి కేంద్రీకరించేలా ముందుకు తీసుకువెళ్లాలి అన్నారు.

# వెనక్కి తగ్గిన కేంద్రం..

## ఫోన్లలో సంచార్ సాథీ యాప్ తప్పనిసరి కాదు

మొబైల్ ఫోన్‌లలో సంచార్ సాథీ యాప్ ప్రీ-ఇన్‌స్టలేషన్‌పై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో, ఈ యాప్ ప్రీ-ఇన్‌స్టలేషన్ తప్పనిసరి కాదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు ముందస్తు ఇన్‌స్టలేషన్ ఉత్తర్వును వెనక్కి తీసుకుంది.

కొత్త స్మార్ట్‌ఫోన్‌లలో, అలాగే ఇప్పటికే ఉన్న పరికరాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ద్వారా సంచార్ సాథీ యాప్‌ను ప్రీ-ఇన్‌స్టాల్ చేయాలని టెలికమ్యూనికేషన్స్ విభాగం (డీవోటీ) నవంబర్ 28న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ నిర్ణయంపై ఇప్పుడు కేంద్రం వెనక్కి తగ్గింది. సైబర్ నేరాల నుంచి రక్షణ కోసం సంచార్ సాథీ యాప్‌ను ముందస్తుగానే ఇన్‌స్టాల్ చేసి ఇవ్వాలన్న కేంద్రం ఆదేశాలు దుమారం రేపాయి. ఇది ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడటమేనని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే, యాప్‌ను ఇన్‌స్టాల్ చేసినప్పటికీ, వినియోగదారులు తొలగించుకోవచ్చని, రిజిస్టర్ అయిన తర్వాతే అది




పనిచేయడం ప్రారంభిస్తుందని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అయినప్పటికీ, ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. ఇదిలా ఉండగా, ఇప్పటికే 1.5 కోట్ల మందికి పైగా సంచార్ సాథీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

## రేవంత్ రెడ్డి హిందూ సమాజానికి

# క్షమాపణలు చెప్పాలి

**-హిందూ దేవుళ్లను అవమానించడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని విమర్శ**

**-రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను గాయపరిచేలా ఉన్నాయని వ్యాఖ్య**

**-హిందుగాళ్లు, బొందుగాళ్లు అంటే ప్రజలు ఏ రకమైన తీర్పు ఇచ్చారో గుర్తుంచుకోండని హితవు**

కాంగ్రెస్ పార్టీ హిందువులను, హిందూ దేవుళ్లను అవమానించడమే ధ్యేయంగా పెట్టుకున్నట్లు ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ దేవుళ్లను అవమానించేలా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ సమాజానికి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలు గాయపరిచేలా ఉన్నాయని అన్నారు. గతంలో కేసీఆర్ హిందుగాళ్లు, బొందుగాళ్లు అంటే ప్రజలు ఏ రకమైన తీర్పు ఇచ్చారో గుర్తు చేసుకోవాలని అన్నారు. తెలంగాణలో రైతులకు ఒక న్యాయం, పారిశ్రామికవేత్తలకు మరొక న్యాయమా అని ఆయన ప్రశ్నించారు.






## డిప్యూటీ సీఎం పదవికి

# పవన్ అనర్హుడు..

**కేబినెట్ నుంచి తొలగించాలి : సీపీఐ నారాయణ**

**- పవన్ వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టేలా ఉన్నాయన్న నారాయణ**

**- రాజకీయాలు వదిలి సనాతన ధర్మం చూసుకోవాలని హితవు**

**- దిష్టి వంటి మాటలు మాట్లాడేవారికి రాజకీయాల్లో స్థానం లేదని వ్యాఖ్య**


**- పవన్ కల్యాణ్ ను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్**



## పుతిన్ భారత పర్యటన..

# ఢిల్లీలో డ్రోన్లు, స్నైపర్లు, ఏఐతో పటిష్ఠ నిఘా

**-భారత పర్యటనకు రానున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్**





# ఒక్కో రోజు పళ్లు తోముకోకపోతే
# ఇంత డేంజరా



**ఆరోగ్యం, సింహగర్జన ప్రత్యేకం, డిసెంబర్ 03 :** చలికాలంలో చల్లటి నీళ్లకు భయపడి చాలా మంది పళ్లు తోముకోవడానికి బద్ధకిస్తారు. ఒక రోజు తోముకోకపోతే ఏమవుతుందిలే అని అనుకుంటారు. కానీ ఈ చిన్న అలవాటు ప్రాణాపాయానికి కూడా దారితీసే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు, అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ప్రకారం.. మీరు తిన్న 20 నిమిషాల్లోనే నోటిలోని బ్యాక్టీరియా చక్కెర, స్టార్చ్‌ను ఆమ్లంగా మారుస్తుంది. ఈ ఆమ్లం దంతాల బయటి పొర అయిన ఎనామిల్‌ను దెబ్బతీయడం ప్రారంభిస్తుంది.

**- బ్యాక్టీరియా డబుల్**

తిన్న 4-6 గంటల తర్వాత దంతాలపై ప్లేక్ అనే జిగట పొర ఏర్పడటం మొదలవుతుంది. 12 గంటల తర్వాత ఈ ప్లేక్ గట్టిపడి టార్టార్‌గా మారుతుంది. 24 గంటల తర్వాత చిగుళ్ళు ఉబ్బడం, రక్తస్రావం కావడం, నోటి నుండి దుర్వాసన రావడం ప్రారంభమవుతుంది. ఎయిమ్స్‌కి చెందిన దంతవైద్యుల అభిప్రాయం ప్రకారం.. మీరు ఒక రోజు పళ్లు తోముకోకపోతే మీ నోటిలో ఒక మిలియన్ బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంది.

**- దీర్ఘకాలిక ప్రమాదాలు.. మరణానికి సంకేతం!**

పళ్లు తోముకోకుండా ఈ అలవాటును కొనసాగించడం అనేది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు, చివరికి మరణానికి కూడా దారితీయవచ్చు.

**- మరణ ప్రమాదం పెరుగుదల :**

లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం.. రోజూ పళ్లు తోముకోని వ్యక్తులకు మరణ ప్రమాదం 25 శాతం పెరుగుతుంది.

**- గుండె జబ్బుల ముప్పు :**

మీరు ఒక సంవత్సరం పాటు పళ్లు తోముకోకపోతే మీ గుండె జబ్బుల ప్రమాదం మూడు రెట్లు పెరుగుతుంది. నోటిలోని బ్యాక్టీరియా రక్తప్రవాహంలోకి ప్రవేశించి ధమనులలో వాపును కలిగిస్తుంది. ఇది గుండె సమస్యలకు దారితీస్తుంది.

**- ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు :**

ఇదే బ్యాక్టీరియా ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, న్యుమోనియాకు కూడా కారణమవుతుంది.

**- నోటి క్యాన్సర్ :**

పొగాకు వాడకపోయినా, పళ్లు తోముకోని వారికి నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**- దంత క్షయం :**

ఒక సంవత్సరం పాటు పళ్లు తోముకోకపోతే దంతాలు పూర్తిగా కుళ్ళిపోయి, కుహరాలు, చీము, విపరీతమైన నొప్పికి దారితీస్తాయి. ఇది చిగుళ్ల వ్యాధికి కారణమై, దంతాలు వదులై ఊడిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి ఒక రోజు పళ్లు తోముకోకపోవడం చిన్న విషయమేమీ కాదు. మీ మొత్తం శరీర ఆరోగ్యాన్ని రక్షించడానికి రోజుకు రెండుసార్లు పళ్లు తోముకోవడం తప్పనిసరి.

## రేవంత్ రెడ్డి హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలి:

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కాదని పారిశ్రామికవేత్తలకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. హిల్ట్ పాలసీని హడావుడిగా తీసుకు వచ్చారని మండిపడ్డారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటికే అనేక మౌలిక సమస్యలు ఉన్నాయని, ఇప్పుడు హిల్ట్ పేరుతో నగరంలో 9 వేల ఎకరాల్లో మల్టీపర్పస్ కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తే జరగబోయే పరిణామాలను ముఖ్యమంత్రి అంచనా వేశారా అని నిలదీశారు. హైదరాబాద్ నగరాన్ని మరో బెంగళూరుగా మార్చాలని చూస్తున్నారా అని ప్రశ్నించారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్య కారణంగా పెట్టుబడులు వెనక్కి వెళ్లాయని గుర్తు చేశారు. ఇప్పుడు హైదరాబాద్‌ను కూడా అదే స్థితికి తీసుకురావాలనుకుంటున్నారా అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో తాను ఏకైక మేధావినని గతంలో కేసీఆర్ నిర్ణయాలు తీసుకున్నారని, ఇప్పుడు మరొక మేధావి రేవంత్ రెడ్డి వచ్చారని విమర్శించారు

## పుతిన్ భారత పర్యటన.. ఢిల్లీలో డ్రోన్లు, స్నైపర్లు, ఏఐతో పటిష్ఠ నిఘా

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు సర్వం సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు భారత్-రష్యా వార్షిక సదస్సులో పాల్గొనేందుకు ఆయన రేపు సాయంత్రం ఢిల్లీ చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో దేశ రాజధానిలో అపూర్వమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పుతిన్‌కు ఐదంచెల అభేద్యమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ భద్రతలో రష్యా అధ్యక్షుడి భద్రతా సిబ్బందితో పాటు, భారత నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) కమాండోలు, స్నైపర్లు, డ్రోన్లు, జామర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మానిటరింగ్ వ్యవస్థలను మోహరించారు. సమాచారం ప్రకారం, ఇప్పటికే రష్యాకు చెందిన 48 మంది ఉన్నత స్థాయి భద్రతా సిబ్బంది ఢిల్లీకి చేరుకున్నారు. వారు ఢిల్లీ పోలీసులు, ఎన్ఎస్‌జీ అధికారులతో కలిసి పుతిన్ ప్రయాణించే అన్ని మార్గాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. పుతిన్ భద్రతలో బయటి వలయాల్లో ఎన్ఎస్‌జీ, ఢిల్లీ పోలీసులు ఉండగా, అంతర్గత వలయాల బాధ్యతను రష్యా అధ్యక్ష భద్రతా దళాలు చూసుకుంటాయి. ప్రధాని మోదీతో ఉన్నప్పుడు, భారత స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) కమాండోలు కూడా ఈ భద్రతలో పాలుపంచుకుంటారు. ఈ పర్యటనలో మరో ప్రత్యేక ఆకర్షణ పుతిన్ వాడే 'అరస్ సెనాట్' అనే అత్యంత సురక్షితమైన లగ్జరీ కారు. దీనిని ప్రత్యేకంగా మాస్కో నుంచి భారత్‌కు తీసుకువస్తున్నారు. 'చక్రాలపై నడిచే కోట'గా పిలిచే ఈ కారు పూర్తి ఆర్మర్డ్ వాహనం. పుతిన్ బస చేసే హోటల్‌తో పాటు ఆయన పర్యటించే రాజ్‌ఘాట్, హైదరాబాద్ హౌస్, భారత్ మండపం వంటి అన్ని ప్రదేశాలను భద్రతా దళాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.

## సొంత నిధులతో సీసీ డ్రెయిన్... ఇలాంటి కౌన్సిలర్ కదా మనకు కావల్సింది...



సంగారెడ్డి, డిసెంబర్, 3

సంగారెడ్డి పట్టణంలోని 16వ వార్డులో డ్రెయిన్ శాశ్వతంగా తీర్చేందుకు సొంత నిధులతో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మాజీ కౌన్సిలర్ కొత్తపల్లి శ్రీకాంత్ తన సొంత నిధులతో భారత్ గ్యాస్ పక్కన, అస్తబాల్ లో 250 మీటర్ల డ్రెయిన్ పనులు చేపట్టారు. ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యం దృష్ట్యా డ్రెయిన్ వ్యవస్థ బలోపేతం అత్యవసరమని, ప్రభుత్వ నిధులు జాప్యం అవుతున్న నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సొంత నిధులతోనే పనులు చేపట్టామని కొత్తపల్లి శ్రీకాంత్ తెలిపారు. గతంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులతో వార్డును అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. వార్డు ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్న పరిష్కారానికి తన వంతు పూర్తి మద్దతు సహకారం ఉంటుందని తెలిపారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మద్దతుతో వార్డును మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. వార్డు ప్రజల ఆశీస్సులు తనపై ఉండాలని శ్రీకాంత్ తెలిపారు. సొంత నిధులతో పనులు చేయడం పై వార్డు ప్రజలు ఆయనను అభినదించారు.

# డిప్యూటీ సీఎం పదవికి పవన్ అనర్హుడు..

విజయవాడ, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 03 : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆ పదవికి అనర్హుడని, ఆయన్ను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. ఇటీవల కోనసీమ జిల్లా పర్యటనలో పవన్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టేలా, ప్రజల ఐక్యతకు భంగం కలిగించేలా ఉన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. తెలుగు రాష్ట్రాలు భౌగోళికంగా విడిపోయినప్పటికీ, ప్రజల మధ్య సత్సంబంధాలు ఉన్నాయని నారాయణ గుర్తుచేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుమార్తెను ఏపీలోని భీమవరానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో పవన్ వ్యాఖ్యలు ఐక్యతను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపించారు. పవన్ కల్యాణ్ రాజకీయ వైఖరిపైనా నారాయణ విమర్శలు చేశారు. రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్లలో చేగువేరా తనకు ఆదర్శమని చెప్పిన పవన్, ఇప్పుడు సావర్కర్‌ను భుజానకెత్తుకుని 'సనాతన ధర్మం' అంటూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయనకు నిజంగా సనాతన ధర్మంపై ఆసక్తి ఉంటే, రాజకీయాలు వదిలిపెట్టి ఆ మార్గంలో వెళ్లవచ్చని సూచించారు. 'దిష్టి తగిలింది' వంటి మాటలు మాట్లాడే సనాతనవాదులకు రాజకీయాల్లో ఉండే అర్హత లేదని నారాయణ వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ రాజకీయాలకు తగరని, ఆయన్ను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

# స్క్రబ్ టైఫస్ కేసుల నమోదుపై సీఎం చంద్రబాబు సమీక్ష

– స్క్రబ్ టైఫస్ అంటువ్యాధి కాదు

ఓరింటియా సుసుగాముషి అనే బాక్టీరియా ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందని, ఇది అంటువ్యాధి కాదని అధికారులు స్పష్టం చేశారు. చిగ్గర మైట్స్ అనే కీటకాలు కుట్టడం ద్వారా ఈ వ్యాధి వస్తుందని, అధిక జ్వరం, చలి, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులతోపాటు... మైట్ కుట్టిన తర్వాత పుండ్లు ఏర్పడడం వంటివి ఈ వ్యాధి లక్షణాలని ముఖ్యమంత్రికి తెలిపారు. సకాలంలో చికిత్స అందిస్తే, ఎటువంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెప్పారు. ఈ ఏడాదిలో చిత్తూరు, కాకినాడ జిల్లాల్లో కేసులు నమోదు అయ్యాయని అధికారులు చెప్పారు.

# పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకూ అభివృద్ధిలో భాగమయ్యేలా జనసేన కమిటీలు

బుధవారం ఉదయం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్యులతో పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పదవులపై సమీక్షించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకూ జనసేన పొందిన నామినేటెడ్ పదవుల వివరాలను పరిశీలించారు. మిగిలిన పదవుల భర్తీపై సూచనలు చేశారు. కూటమి ధర్మాన్ని అనుసరించి ముందుకు వెళ్లడంతోపాటు, పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేసినవారికి వివిధ దశల్లో గుర్తింపు, బాధ్యతలను అందించే దిశగా ప్రయాణిస్తున్నామన్నారు. పార్టీ కమిటీల నియామకంపై పవన్ కళ్యాణ్ పలు సూచనలు అందించారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకూ పార్టీ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలకు అయిదుగురు చొప్పున సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఆ సభ్యులు స్థానికంగా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్ గా పిఠాపురంలో నియోజకవర్గ స్థాయిలో అయిదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటైందని, ఆ కమిటీ పని తీరును మదింపు చేసి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీలు రూపకల్పన చేయాలన్నారు. పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించి నెలకొనే అంశాలను పరిష్కరించేందుకు ఉద్దేశించిన కాన్ ఫ్లిక్ట్ మేనేజ్మెంట్ విభాగాన్ని కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ విభాగంలో 11 మంది వరకూ సభ్యులను నియమించాలని నిర్ణయించారు. ఈ విభాగం ముందుకు వచ్చే అంశం ప్రాధాన్యం, తీవ్రతను బట్టి ముగ్గురు లేదా మొత్తం విభాగంలోని సభ్యులు చర్చించి పరిష్కరించాలని పార్టీ అధ్యక్షులు దిశానిర్దేశం చేశారు. ఇకపై ప్రతి కమిటీలో మహిళలకు స్థానం కల్పించాలని స్పష్టం చేశారు. అయిదుగురు సభ్యులు ఉండే కమిటీలో తప్పనిసరిగా ఒకరు, గరిష్ఠంగా ఇద్దరు వీర మహిళలు సభ్యులుగా ఉండాలని, 11మంది సభ్యులు ఉండే కమిటీ ముగ్గురు వీర మహిళలకు స్థానం ఇస్తూ కమిటీలు ఉండాలని నిర్దేశించారు.

# ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఉపకరణాల పంపిణి

### ముఖ్య అతిథిగా ఎంపీడీవో యం.శేషగిరి శర్మ, ఎంఈఓ బాలు

మిర్యాలగూడ, డిసెంబర్ 03 (

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని, స్థానిక భవిత కేంద్రం నందు ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీడీవో యం.శేషగిరి శర్మ, ఎంఈఓ బాలు పాల్గొన్నారు. ఎంఈఓ బాలు మాట్లాడుతూ భవితా కేంద్రంలో, వివిధ రకాలైనటువంటి వైకల్యాలు కలిగిన, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్యాబోధన మరియు ఫిజియోథెరపీ నిర్వహించబడుతున్నాయని, అదేవిధంగా ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యే విద్యార్థులకు ట్రాన్స్పోర్ట్ ఎస్కార్ట్ అలవెన్సులు కూడా అందజేయడం జరుగుతుందని, మైనర్ కరెక్టివ్ సర్జరీస్, అవసరమైనటువంటి ఉపకరణాలు చెవులు సరిగా వినిపించని వారికి వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, ట్రైసైకిల్స్, చంక కర్రలు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ఎంపీడీవో యం.శేషగిరి శర్మ మాట్లాడుతూ భవిత కేంద్రలా సేవలను వినియోగించుకోవాలని, భవిత కేంద్రంలో అందిస్తున్న సౌకర్యాలను గురించి వివరించారు. మేనరికం వివాహాల వలన వైకల్యాలు కలిగే అవకాశం ఉందని, వీలైనంతవరకు మేనరికం వివాహాలను నివారించడానికి అందరు కూడా




ప్రయత్నించాలని, వైకల్యం కలిగిన పిల్లల తల్లిదండ్రులు నిరుత్సాహం చెందవద్దని, వారికి తగినటువంటి చేయూతను ఇచ్చినట్లయితే సమాజంలో అందరితోపాటు జీవించగలరని, ప్రభుత్వం కూడా అనేక రకాలైనటువంటి రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పిస్తుందని, వాటిని వినియోగించుకోవాలని తెలియజేశారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు స్పెషల్ బిఎడ్ కాలేజ్ ప్రిన్సిపల్ కోటయ్య, స్పెషల్ ఎడ్యుకేటర్స్, తదితరులు పాల్గొన్నారు



# వైట్ ఫ్రాక్ లో ఏంజెల్ లా మనసు దోచుకుంటున్న అమైరా!

అమైరా దస్తూర్..ఈ హీరోయిన్ కి సౌత్ ఇండస్ట్రీలో ఎక్కువగా గుర్తింపు లేకపోయినప్పటికీ బాలీవుడ్ లో మాత్రం మంచి పాపులారిటీ సంపాదించుకుంది. అంతేకాదు సోషల్ మీడియాలో ఎప్పుడు ఏదో ఒక పోస్ట్ పెట్టి సోషల్ మీడియా సెలబ్రిటీగా మారిపోయింది. అయితే అలాంటి అమైరా దస్తూర్ తాజాగా షేర్ చేసిన ఫోటోలు కుర్రకారుకి మత్తెక్కిపోతోంది. తాజాగా అమైరా దస్తూర్ వైట్ కలర్ డ్రెస్ లో ఉన్న కొన్ని ఫోటోలను తన ఇంస్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. ఈ వైట్ కలర్ డ్రెస్ లో అమైరా దస్తూర్ అందాలకు చాలామంది ఫిదా అవుతున్నారు. తెలుపు రంగు డ్రెస్ లో పాలమీగడలాంటి అందంతో అమైరా దస్తూర్ అదుర్స్ అంటూ చాలామంది నెటిజన్స్ ఈ ఫోటోలకి కామెంట్లు పెడుతున్నారు. అంతేకాదు చాలామంది అమైరా దస్తూర్ షేర్ చేసిన ఫోటోలకు లవ్ ఎమోజీలను షేర్ చేస్తూ తెలుపు రంగు డ్రెస్సులో చందమామలా మెరిసిపోతున్నావ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. మరి కొంతమంది వైట్ ఫ్రాక్ లో ఏంజెల్ లా ఉంది అంటూ కామెంట్లు చేస్తున్నారు. అమైరా దస్తూర్ ఇంస్టాగ్రామ్ ఖాతాలో ఫోటోలు షేర్ చేయడమే కాకుండా ఆ ఫోటోలకు "స్త్రీతత్వం వికసించడం" అనే క్యాప్షన్ కూడా ఇచ్చింది. ప్రస్తుతం అమైరా దస్తూర్ ఫోటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. అమైరా దస్తూర్ సినిమాలు,పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే.. మోడలింగ్ ద్వారా సినిమాల్లోకి వచ్చిన అమైరా దస్తూర్ బాలీవుడ్లో 2013 లో వచ్చిన 'ఇసాక్' అనే సినిమాతో ఎంట్రీ ఇచ్చింది.ఆ తర్వాత తమిళంలో వచ్చిన అనేగన్ అనే సినిమాతో తమిళ ప్రేక్షకులకు కూడా దగ్గరైపోయింది. ఈ సినిమా తెలుగులో అనేకుడు అనే పేరుతో విడుదలైంది.అలా మిస్టర్.ఎక్స్, కుంగ్ ఫు యోగ, కాలకండి, రాజ్మా చావల్ , జడ్జిమెంటల్ హై క్యా, మేడ్ ఇన్ చైనా, ప్రస్థానం, కోయి జానే నా వంటి హిందీ సినిమాల ద్వారా బాలీవుడ్ లో ఫేమస్ అయింది. అలాగే తెలుగులో మనసుకు నచ్చింది, రాజుగాడు వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరయ్యింది. చివరిగా అమైరా దస్తూర్ తమిళంలో బఘిర అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కేవలం సినిమాలు మాత్రమే కాకుండా, ది ట్రిప్ -2,తాండవ్, డోంగ్రి టు దుబాయ్ వంటి వెబ్ సిరీస్ లలో కూడా నటించింది.అలా సినిమాలు, వెబ్ సిరీస్ లు చేస్తూనే మరోపక్క సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ఇంటర్ నెట్ లో కూడా యాక్టివ్ గా ఉంటుంది



# విడుదలైన రోజే కలెక్షన్లు కొట్టేయాలన్న ఉద్దేశం లేదు: హీరో రామ్

యంగ్ హీరో రామ్ పోతినేని తన తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా' విడుదల విషయంలో ఒకానొక దశలో భయపడినట్లు వెల్లడించారు. గతంలో వెంకటేశ్‌తో కలిసి తాను నటించిన 'మసాలా' సినిమా నవంబర్‌లో విడుదలై ఆశించిన విజయం సాధించలేదని, ఆ సెంటిమెంట్‌తో ఈ సినిమా నవంబర్ రిలీజ్‌కు కాస్త ఆందోళన చెందానని తెలిపారు. చిత్ర యూనిట్ నిర్వహించిన థాంక్స్ మీట్‌లో ఆయన ఈ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ.. ఎక్కువ మంది ప్రేక్షకులు చూడాలనే ఉద్దేశంతోనే 'ఆంధ్ర కింగ్ తాలూకా' తీశామని, కానీ కొన్ని పరిస్థితుల వల్ల అన్ సీజన్‌లో విడుదల చేయాల్సి వచ్చిందన్నారు. ఈ సినిమాకు తాను ఎంతగానో కనెక్ట్ అయ్యానని, అందుకే ఏ సినిమాకూ చేయనంత ప్రచారం చేశానని వెల్లడించారు. హీరో-అభిమాని మధ్య ఉండే అనుబంధాన్ని చూపించే చిత్రం ఇది అని వివరించారు.

సినిమా ఫలితంపై స్పందిస్తూ.. మిగతా సినిమాల విషయంలో హిట్టా? ఫట్టా? అని ఆలోచిస్తాం కానీ ఈ సినిమా విషయంలో ఇది మంచి సినిమా అని ప్రేక్షకులు వెంటనే గుర్తిస్తారా లేక ఆలస్యంగా గుర్తిస్తారా అనేదే తమ ఆలోచన అని అన్నారు. విడుదల రోజే కలెక్షన్ల రికార్డులు కొట్టాలన్న ఉద్దేశం తమకు లేదని, ప్రేక్షకుల అభిప్రాయాన్ని తాను గౌరవిస్తానని అన్నారు. ప్రేక్షకులకు నచ్చకపోతే ఆ విషయాన్ని అక్కడితో వదిలేస్తానని రామ్ స్పష్టం చేశారు.

నవంబర్ 27న విడుదలైన ఈ చిత్రంలో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్ర పోషించగా, ఆయన వీరాభిమానిగా రామ్ నటించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే, దర్శకుడు పి. మహేశ్‌బాబు, నిర్మాత రవిశంకర్ పాల్గొన్నారు.




# పూజాహెగ్డే నెక్ట్స్ ప్లాన్స్ ఏంటి..?



బుట్ట బొమ్మ పూజా హెగ్డే సౌత్ కెరీర్ అంతంత మాత్రంగానే ఉంది. తమిళ్ లో కాస్త పర్వాలేదు కానీ తెలుగులో మాత్రం అమ్మడికి ఛాన్స్ లు లేక కాస్త ఇబ్బంది పడుతుంది. ప్రభాస్ తో రాధే శ్యాం చేసిన ఈ అమ్మడు నెక్ట్ మహేష్ గుంటూరు కారం లో ఛాన్స్ వచ్చినట్టే వచ్చి చేజార్చుకుంది. ఆ తర్వాత పూజా హెగ్డేకి తెలుగులో ఒక్క మూవీ కూడా పడలేదు. నాగ చైతన్య, నాని సినిమాల్లో ఛాన్స్ అంటూ వార్తలు రావడమే కానీ అందులో ఏ ఒక్కటి నిజం కాలేదు. తెలుగులో ఛాన్స్ లు లేకుండా.. ఐతే తమిళ్ లో ఆల్రెడీ జన నాయగన్ లో నటిస్తున్న పూజా హెగ్దే నెక్ట్ కాంచనా 4లో కూడా ఉందని తెలుస్తుంది. ఇదే కాకుండా మరో సినిమా డిస్కషన్ లో ఉందట. హిందీలో కూడా ఒక ప్రాజెక్ట్ చేస్తుంది పూజా బేబ్. ఎటొచ్చి అమ్మడికి తెలుగులోనే సరైన ఛాన్స్ లు లేకుండా అవుతున్నాయి. పూజా హెగ్దే దుల్కర్ సల్మాన్ కాంబినేషన్ లో ఒక సినిమా వస్తుంది. ఆ సినిమాతో అమ్మడి కొద్దిపాటి గ్యాప్ తర్వాత తెలుగు ఎంట్రీ ఇస్తుంది. బుట్ట బొమ్మని తెలుగు మేకర్స్ ఎందుకు పట్టించుకోవట్లేదు అన్నది తెలియదు కానీ ఆమె ఉంటే సినిమాలో గ్లామర్ షోకి డౌట్ పడాల్సిన అవసరం లేదు. ఇక పూజా బేబీ ఫ్యాన్స్ కి కావాల్సినంత హాట్ స్టఫ్ ఇస్తుంది. కెరీర్ లో ఇప్పటివరకు గ్లామర్ పరంగా తన మార్క్ చూపిస్తూ వచ్చిన పూజా హెగ్దే ఇక మీదట గ్లామర్ ఒక్కటే కాదు తన యాక్టింగ్ టాలెంట్ కూడా చూపించాలని ఫిక్స్ అయ్యింది. అందుకే అమ్మడు ఈమధ్య సినిమాలను కూడా ఆచి తూచి సెలెక్ట్ చేస్తుంది. దుల్కర్ సల్మాన్ తో పూజా హెగ్దే.. దుల్కర్ సల్మాన్ తో సినిమా అంటే మినిమం గ్యారెంటీ ఉన్నట్టే లెక్క. తెలుగు, తమిళ్ భాషల్లో ఈ సినిమా రిలీజ్ ఛాన్స్ ఉందని తెలుస్తుంది. సో అటు కోలీవుడ్ లో పూజా మేనియా కొనసాగించేందుకు కూడా ఈ సినిమా సపోర్ట్ చేస్తుంది. ఇదే కాదు టాలీవుడ్ స్టార్ సినిమాల్లో కూడా పూజా నటించాలని చూస్తుంది. ముఖ్యంగా హిందీ ఆడియన్స్ కి తను పరిచయమే కాబట్టి తెలుగు పాన్ ఇండియా సినిమాలు ఆఫర్ వస్తే చేయాలని ఆసక్తిగా ఉంది పూజా హెగ్దే. మరి ఆ ఛాన్స్ ఎవరిస్తారన్నది చూడాలి. పూజా హెగ్దే హిందీలో ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆమెకు అక్కడ సరైన లక్ కలిసి రావట్లేదు. అందుకే అమ్మడు సౌత్ సినిమాల మీదే తన ఫోకస్ పెడుతుంది. తెలుగులో ఒక్క స్టార్ మూవీ ఛాన్స్ వస్తే మళ్లీ తిరిగి కెరీర్ లో పట్టు సాధించాలని చూస్తుంది అమ్మడు

Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com